క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీ కండువా కప్పుతున్న పుట్ట మధు

మంథని: మంథని, ముత్తారం, రామగిరి మండలాలకు చెందిన పలువురు శనివారం మంథనిలోని జెడ్పీచైర్మన్ నివాసంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పుట్ట మధు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంథని మున్సిపల్ పరిధిలోని ముత్యాలమ్మవాడ, మండలంలోని గుమ్నూర్, మైదుపల్లి ఒడ్డెర కాలనీకి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో ముత్యాలమ్మ వాడకు చెందిన బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు దాసరి శ్రావణ్, ఎస్సీ సెల్ మోర్చా అధ్యక్షుడు కసర్ల సూర్య, గుమ్నూర్ గ్రామానికి చెందిన నాయకులు, మైదుపల్లికి చెందిన 8వ వార్డు సభ్యుడు కుంట పోశెట్టితో 50మంది యువకులు పార్టీలో చేరారు. రామగిరి మండలం ఆదివారంపేటకు చెందిన కాంగ్రెస్ నాయకులు, ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్, ఖమ్మంపల్లికి చెందిన వారు పార్టీలో చేరారు.

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి

మంథని: విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లో రాణించాలని జెడ్పీచైర్మన్ పుట్ట మధుకర్ అన్నారు. మంథనిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలను మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి ఆయన ప్రారంభించారు.

మెగా డీఎస్సీ ప్రకటించాలి

గోదావరిఖనిటౌన్: రాష్ట్ర ప్రభుత్వం వెంటనే మెగా డీఎస్సీ ప్రకటించాలని, లేకుంటే ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఎన్ఎస్‌యూఐ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మెంటం ఉదయ్‌రాజ్ అన్నారు. శనివారం మున్సిపల్ అంబేడ్కర్ చౌరస్తాలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఉదయ్‌రాజ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం డిఎస్సీ నోటిఫికేషన్ ప్రకటనలో నిరుద్యోగులకు అన్యాయం చేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా 23వేల ఉపాధ్యాయ ఖాళీలు ఉన్నప్పటికీ కేవలం 5వేల ఖాళీలకే నోటిఫికేషన్ ప్రకటించడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రావణ్, రాకేశ్, కళ్యాణ్, సాగర్, వినయ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

పాలకుర్తి: మండలంలోని కుక్కలగూడుర్ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం బూత్‌స్థాయి అధికారులు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఆర్ఐ.అమృత్‌కుమార్, పాఠశాల హెచ్ఎం జింక మల్లేషం, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత



నిత్యావసరాలు అందజేస్తున్న సభ్యులు

రామగిరి: మండలంలోని రత్నాపూర్ గ్రామానికి చెందిన పేదింటి అమ్మాయి వివాహానికి శనివారం లయన్స్ క్లబ్ సభ్యులు నిత్యావసరాలు అందజేశారు. రత్నాపూర్ గ్రామానికి చెందిన కాదాసు రాజేశ్వరి కూతురు వివాహం చేయడానికి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోందని సర్పంచ్ పల్లె ప్రతిమ లయన్స్ క్లబ్ సభ్యుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన లయన్స్ క్లబ్ సభ్యులు రూ.12వేల విలువ గల నిత్యావసర వస్తువులను అందజేశారు. ముల్కూరి శ్రీనివాస్, గంట వెంకటరమణారెడ్డి, డా.మేకల శరణ్య, తీగల శ్రీధర్, తోట్ల రాజు, బొగె సతీశ్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

పెద్దపల్లిరూరల్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీసవేతనం రూ.26వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు డిమాండ్ చేశారు. పెద్దపల్లిలో శనివారం కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. 12న ఎమ్మెల్యేల ఇంటి ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. నాయకులు వెంకటస్వామి, చంద్రయ్య, కొమురయ్య, అన్వేష్, లక్ష్మి, శ్రీనివాస్, అంజయ్య, మరియ, కొండయ్య, రాజయ్య ఉన్నారు.

వేజ్‌బోర్డు ఏరియర్స్ చెల్లించాలి

గోదావరిఖని: సింగరేణి కార్మికుల వేజ్‌బోర్డు ఏరియర్స్ వెంటనే చెల్లించాలని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య డిమాండ్ చేశారు. శనివారం జీడీకే–2ఏ గనిపై ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. జేబీసీసీఐ ఒప్పందం మేరకు సెప్టెంబర్ వేతనాలతో చెల్లించాల్సి ఉన్నా యాజమాన్యం పట్టించుకోలేదని ఆరోపించారు. ఏరియర్స్ చెల్లించకుంటే సింగరేణివ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. నాయకులు హరీశ్, వై.సారంగపాణి, వెంకటస్వామి, బోడకుంట రాజేశం, కోటయ్య, విజయ్‌కుమార్, అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మట్టి విగ్రహాలనే పూజిద్దాం



సండే స్పెషల్

- పర్యావరణంపై ప్రజల్లో పెరుగుతున్న అవగాహన
- ఎన్టీపీసీ అన్నపూర్ణకాలనీలో మట్టి వినాయకుల తయారీ
- కుటీర పరిశ్రమగా ఏర్పాటు, పలువురికి ఉపాధి

జ్యోతినగర్: ఏకదంతా..వినాయకా..ఏలుకోవయ్యా.. గణపతి బొప్ప మోరియా నినాదాలతో తొమ్మిది రోజులు పూజలందుకునే వినాయక చవితి పండుగకు విగ్రహాలు తయారు చేస్తున్నారు. గణపతి నవరాత్సోవాలు అంటే యువతకు ఎంతో ఇష్టం. నవరాత్రోత్సవాలలో ప్రత్యేక పూజలు, అన్నదానాలు చేయడం పరిపాటి. చవితి రోజున వినాయకుడి విగ్రహాలను పూజించే ఆనవాయితీ ఉంది. పర్యావరణవేత్తలు సూచనల మేరకు మట్టి విగ్రహాల తయారీదారులకు కొంత ఆర్థికంగా సంపాదించే అవకాశం కలిగింది.

- పిండి బొమ్మగా రూపం దాల్చి అమ్మ చేతుల మీదుగా ప్రాణం పోసుకున్న ఘనత గణనాథుడిది. ఆ రూపం జ్ఞానదాయకం. ఆ తేజం లోక కళ్యాణకారకం. నిండు రూపాన్ని గుండెల్లో కొలుచుకునే చవితి వేడుకలు కాలుష్యకారకాలుగా మారకుండా.. బొజ్జ గణపయ్య నిండు దీవెనలు పొందాలంటే మట్టి మూర్తులనే పూజించాలని పర్యావరణవేత్తలు సూచిస్తున్నారు.



మట్టి విగ్రహాలను తయారు చేస్తున్న మహిళలు

కుటీర పరిశ్రమగా ఏర్పాటు

- ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీకి చెందిన తెలంగాణ మహిళా మిత్ర, శ్రీసరస్వతీ మహిళా మండలి వ్యవస్థాపకురాలు గోలివాడ చంద్రకళ మట్టి విగ్రహాల తయారీని కుటీర పరిశ్రమగా మార్చుకున్నారు. ఏటా విగ్రహాల తయారీలో 10మందికి ఉపాధి కల్పిస్తున్నారు. పర్యావరణంపై ప్రజలకు అవగాహన పెరగడంతో మట్టి వినాయక విగ్రహాలనే పూజించేందుకు ప్రజలు మొగ్గు చూపుతున్నారు. పుష్కరకాలంగా మట్టి విగ్రహాలను తయారు చేస్తూ పలు స్వచ్ఛంద సంస్థలకు, ఎన్టీపీసీ, సింగరేణి సంస్థలకు అందజేస్తున్నారు. ప్రస్తుతం ఆర్డర్లను బట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు.

ఉపాధి లభిస్తోంది

వినాయక విగ్రహాలను తయారు చేయడంతో కొంత ఉపాధి లభిస్తోంది. వినాయక చవితి వరకు విగ్రహాలను తయారు చేస్తాం. ఇంట్లో ఖాళీగా కూర్చోకుండా భగవంతుడి విగ్రహాలను తయారు చేయడం సంతోషంగా ఉంది. వినాయక పూజలు చేసే ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించాలి, పర్యావరణాన్ని కాపాడండి. – నర్మద, గృహిణి, అన్నపూర్ణకాలనీ

హోల్‌సేల్ ధరలకే విక్రయం..

- ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలో 3 అంగుళాల నుంచి 10 అంగుళాల సైజు వరకు మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నారు. ఇక్కడ హోల్‌సేల్ ధరలకు విక్రయిస్తుంటారు. విగ్రహాల తయారీకి పవిత్ర గోదావరి నది ఒడ్డున ఉన్న మట్టిని వినియోగిస్తారు. రెండు నెలల నుంచే విగ్రహాల తయారీకి కావాల్సిన వస్తువులను సిద్ధం చేసుకుంటారు.

ఆర్డర్లను బట్టి విగ్రహాల తయారీ



మట్టి విగ్రహాలు కావాలని ఆర్డర్ ఇస్తే వాటి ప్రకారంగా తయారు చేసి ఇస్తాం. వినాయక విగ్రహాలను తయారీతో పాటు వాటిలో పాల చెట్టు గింజలు ఉంచుతున్నాము. వాటిని నిమజ్జనం చేసే సమయంలో అక్కడ మొక్కలు పెరిగి పర్యావరణాన్ని కాపాడతాయని చిన్న ప్రయత్నం. ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలనే పూజించాలి. 12ఏళ్లుగా మట్టి విగ్రహాలను తయారు చేస్తున్నాను. విగ్రహాల సైజును బట్టి ధర రూ.20 నుంచి రూ.500వరకు విక్రయిస్తున్నాం. విగ్రహాలు అవసరమున్నవారు 83413 83334 నంబర్‌ను సంప్రదించాలి. – గోలివాడ చంద్రకళ, తెలంగాణ మహిళామిత్ర వ్యవస్థాపక అధ్యక్షురాలు

వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేయాలి



సుల్తానాబాద్‌లో నివాళి



రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో..



రామగిరి: నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



కమాన్‌పూర్‌లో..

సుల్తానాబాద్: దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయ సాధనకు కాంగ్రెస్ కార్యకర్తలు కృషి చేయాలని పార్టీ తాలూకా ప్రెసిడెంట్ దామోదర్ రావు అన్నారు. మండల కేంద్రంలోని నెహ్రూ విగ్రహం వద్ద శనివారం వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.
ముత్తారం: మండలంలోని కేశనపల్లిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.
రామగిరి: మండలంలోని సెంటినరీకాలనీ, పన్నూర్ గ్రామాల్లో నివాళి అర్పించారు.
రామగుండం: అంతర్గాం మండల కేంద్రంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పట్టణంలోని తబితా ఆశ్రమంలోని చిన్నారులకు అన్నదానం చేశారు.
కమాన్‌పూర్: మండల వ్యాప్తంగా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న జిల్లా అధికారులు

జూలపల్లి: 18ఏళ్లు నిండిన యువత ఓటరుగా నమోదు చేసుకుని రానున్న సాధారణ ఎన్నికల్లో తమ ఓటును వినియోగించుకోవాలని తహశీల్దారు ఎండీ.బషీరోద్దీన్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ఓటుహక్కు నమోదు, ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఆర్ఐ సదయ్య, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.
రామగిరి: ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ రాంచందర్‌రావు సూచించారు. ఓటరు నమోదు స్పెషల్ క్యాంపులో భాగంగా శనివారం ఆయా పోలింగ్ కేంద్రాలను సందర్శించి దరఖాస్తులను పరిశీలించారు.
రామగుండం: కుందనపల్లి కేజీబీవీ విద్యాలయంలోని విద్యార్థులకు స్వీప్ ఆక్టివిటీస్ జిల్లా నోడల్ అధికారి రవూఫ్‌ఖాన్ శనివారం ఓటుహక్కు ప్రాధాన్యం గురించి అవగాహన కల్పించారు. అంతర్గాం తహశీల్దార్ పి.రామ్మోహన్‌రావు ఉన్నారు.
ఓదెల: మండలంలోని శానగొండ, ఇందుర్తి, గుంపుల, గూడెం, కొమిర గ్రామాల్లోని బీఎల్వో సెంటర్లను తహశీల్దార్ యాకన్న సందర్శించారు.
సుల్తానాబాద్‌రూరల్: మండంలోని కాట్నపల్లి, నర్సయ్యపల్లి, గర్రెపల్లి తదితర గ్రామాల్లో ఓటరు ప్రత్యేక క్యాంపులను శనివారం తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు.

ప్రత్యేక ఓటరు నమోదు

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో 22 పోలింగ్ బూత్‌ల వద్ద శనివారం ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించారు. 18ఏళ్లు నిండిన యువత నుంచి బీఎల్‌వోలు దరఖాస్తులు స్వీకరించారు. తహసీల్దార్ స్వర్ణ, ఆర్ఐలు శైలజ, రజిత, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ఖిలావనపర్తి ఆలయంలో మేరీ మిట్టి మేరా దేశ్

ధర్మారం: బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మేరీ మిట్టి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా ధర్మారం మండలం బీజేపీ మండల అధ్యక్షుడు గుజ్జుల వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని బొట్లవనపర్తి గ్రామంలోని శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయం, సీతారామాంజనేయస్వామి దేవస్థానం ప్రాంతంలో మట్టిని సేకరించారు. మండల ప్రధాన కార్యదర్శి సందనవేని లక్ష్మణ్, జిల్లా నాయకులు మెడవేని శ్రీనివాస్, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు జంగిలి కిశోర్, కొక్కుల బాలకృష్ణ, నాయకులు లక్ష్మణ్, తూడి సంపత్, జనగామ సంజీవ్, సంఘ లక్ష్మణ్, గుమ్ముల తిరుపతి, తిరుమల ప్రసాద్, కొమురయ్య, నాడెం మల్లేశం, వెంకటేశం, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల సన్నిధిలో ఎమ్మెల్యే



కుటుంబ సమేతంగా ఎమ్మెల్యే దాసరి

పెద్దపల్లిరూరల్: ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి శనివారం కుటుంసభ్యులతో కలిసి తిరుమలలోని శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కులు సమర్పించారు. అనంతరం నాగసాయి మండపంలో ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు.

బదిలీపై వెళ్తున్న డీజీఎంకు సన్మానం



సన్మానిస్తున్న జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని: సింగరేణి సంస్థ రామగుండం డివిజన్–2లో ఎన్విరాన్‌మెంట్ డీజీఎంగా పనిచేసి బదిలీపై వెళ్తున్న రాజారెడ్డిని శనివారం జీఎం సూర్యనారాయణ సన్మానించారు. జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సన్మానించి జ్ఞాపికను బహూకరించారు. ఎస్ఓటూ జీఎం అబ్దుల్ సలీం, ప్రాజెక్ట్ అధికారి మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, ఏరియా రక్షణ అధికారి బి.రవీందర్, డీజీఎం పర్సనల్ జి.రాజేంద్రప్రసాద్, వర్క్‌షాప్ డీజీఎం ఎర్రన్న పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన



కందిని పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

కమాన్‌పూర్: మండలంలోని పెంచికల్‌పేట గ్రామంలో రైతులు సాగుచేస్తున్న కంది పంటను శనివారం రామగిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఇటీవల రైతులకు ఉచితంగా కంది విత్తనాలు పంపిణీ చేయగా సాగు చేసిన కంది పంటను శాస్త్రవేత్తలు పరిశీలించారు. రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శ్రీనివాస్, కిరణ్, వినోద్, ఏవో ప్రమోద్‌కుమార్, ఏఈవో సురేశ్ ఉన్నారు.

ముగిసిన ఎస్‌జీఎఫ్ మండలస్థాయి పోటీలు

జ్యోతినగర్: రామగుండం మండలం(వెస్ట్) స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ మండల స్థాయి ఎంపిక పోటీలు ముగిశాయి. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని ప్రభుత్వ జిల్లా ప్రజా పరిషత్ హైస్కూల్ క్రీడా మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న పోటీలు శనివారం ముగిశాయని ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురోజు శ్రీనివాస్ తెలిపారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి షేక్ సందర్శించి అభినందించారు. మండల స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు జోన్ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అథ్లెటిక్స్ అండర్–14, 17 విభాగంలో ఎంపికైన క్రీడాకారుల జాబితాను విడుదల చేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఉన్నారు.

నియోజకవర్గ ప్రజల చూపు బీఎస్పీ వైపు



మాట్లాడుతున్న దాసరి ఉష

ఎలిగేడు: బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలను ప్రజలు నమ్మి ఓటేసే రోజులు పోయాయని, నియోజకవర్గ ప్రజలు బీఎస్పీ వైపు చూస్తున్నారని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి ఉష అన్నారు. మండలంలోని నారాయణపల్లిలో శనివారం మన ఊరు–మన ఉష కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని గడప గడపకూ తిరుగుతూ పేద ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట వెంకటేశ్, అసెంబ్లీ ఉపాధ్యక్షుడు నార్ల గోపాల్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి సాతూరి అనిల్, కోశాధికారి ఎండీ.రియాజ్, ఎలిగేడు మండల అధ్యక్షుడు మారం సతీశ్‌యాదవ్, మండల మహిళా కన్వీనర్ శారద, నాయకులు బీవీఎఫ్ టీం అసెంబ్లీ కన్వీనర్ సాగర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి



దీక్ష చేస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం వెంటనే ఉపాధ్యాల పోస్టులను భర్తీ చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌గౌడ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం చేపట్టిన నిరసన దీక్ష కార్యక్రమాన్ని సందర్శించారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొమ్మ అభిలాష్, కార్యదర్శి విజయ్‌కుమార్, నాయకులు అరవింద్, రాహుల్, వినీత్, రాజశేఖర్, అన్వేష్, సతీశ్, సుమంత్, అశ్విన్, నాగరాజు, ప్రదీప్, కుమార్, శశికుమార్ పాల్గొన్నారు.

ఆర్‌పీఎఫ్ కానిస్టేబుల్‌కు అభినందనలు



దినేశ్‌చంద్

రామగుండం: రామగుండం పోలీస్‌స్టేషన్‌లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న దినేశ్‌చంద్‌ను సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ సి.బెనర్జీ అభినందించారు. ఆగస్టు 30న మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఆసిఫాబాద్ కొమురంభీమ్ జిల్లా రవీంద్రనగర్‌కు చెందిన పోసా మండల్ మంచిర్యాల రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫారం హమాలీవాడ వైపు నుంచి ఆసిఫాబాద్ వెళ్లేందుకు పట్టాల మీదుగా ఒకటో నెంబర్ ప్లాట్‌ఫాం ఎక్కే క్రమంలో అటునుంచి వేగంగా వస్తున్న గూడ్సు రైలును గమనించలేదు. అక్కడే విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ప్రయాణికుడిని ప్లాట్‌ఫాంపైకి లాగారు. ఈ దృశ్యాలన్నీ రైల్వేస్టేషన్‌లోని సీసీ ఫుటేజీలో రికార్డు కావడంతో గుర్తించిన సికింద్రాబాద్ డివిజనల్ సీనియర్ సెక్యూరిటీ కమిషనర్ సి.బెనర్జీ దినేశ్‌చంద్‌ను అభినందిస్తూ 'మిషన్ జీవన్ రక్ష' అనే బిరుదుతో ప్రశంసిస్తూ కానిస్టేబుల్‌కు లేఖ పంపించారు.

అర్హులకు దళితబంధు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మంథని: అర్హులైన నిరుపేదలకు అన్యాయం చేసి అనర్హులకు దళితబంధు కేటాయించారని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌కు వినతిపత్రం అందజేశారు. శనివారం మంథని పర్యటనకు వచ్చిన జిల్లా అదనపు కలెక్టర్‌ను ప్రజా సంఘాల నాయకులు తహశీల్దార్ కార్యాలయం వద్ద కలిశారు. నిరుపేద దళితుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన దళితబంధు పథకం ఉన్నత వర్గాలకు వరంగా మారి పథకం నిర్వీర్యం అవుతోందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేశ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్ల సందీప్, దళిత ప్రజా సంఘాల నాయకులు బూడిద తిరుపతి, మంథని లింగయ్య, సంపత్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

✦సెక్యూరిటీ సిబ్బందిపై దాడి సరికాదు

రామగిరి: ఆర్జీ–3 డివిజన్‌లో శుక్రవారం రాత్రి ఎస్అండ్‌పీసీ సిబ్బంది అగ్గి నాగరాజుపై దాడిని టీబీజీకేఎస్ తరఫున ఖండిస్తున్నామని ఆర్జీ–3 డివిజన్ ఉపాధ్యక్షుడు గౌతం శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి దాడులు పునరావృతం కాకుండా యాజమాన్యం చర్యలు చేపట్టాలని, సెక్యూరిటీ సిబ్బందిని పెట్రోలింగ్‌కు ఒంటరిగా కాకుండా టీమ్‌లు ఏర్పాటు చేసేలా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

✦ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లిలో మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో వారంరోజులుగా నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరం శనివారంతో ముగిసింది. ప్రోగాం అధికారి దుర్గారావు, తిరుపతి, సదానందం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

✦ముదిరాజ్‌లపై చిన్నచూపు తగదు

మంథని: బీఆర్ఎస్ అభ్యర్థుల కేటాయింపులో ముదిరాజ్ కులానికి చెందిన వారికి అవకాశం ఇవ్వకపోవడం సరికాదని జిల్లా ముదిరాజ్ మహాసభ యువత అధ్యక్షుడు పోతరవేన క్రాంతికుమార్, మండల అధ్యక్షుడు గుండా రాజు అన్నారు. శనివారం మంథని ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ సాధన పోరాటంలో ముఖ్యభూమిక పోషించిన తమను మరచిపోవడం సరికాదన్నారు.

✦ఆటో యూనియన్ గుడిసె దహనం

కాల్వశ్రీరాంపూర్: కాల్వశ్రీరాంపూర్ బస్టాండ్ చౌరస్తాలో ఆటో యూనియన్ గుడిసెను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ విషయమై యూనియన్ అధ్యక్షుడు చాంద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

✦క్షీరాభిషేకం

ధర్మారం: సీఎం కేసీఆర్ వీవోఏలకు గౌరవవేతనం పెంపును హర్షిస్తూ మండల కేంద్రంలోని సెర్ప్ కార్యాలయంలో శనివారం కేసీఆర్ మంత్రి కొప్పుల ఈశ్వర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

✦కొనసాగుతున్న రెండో ఏఎన్ఎంల సమ్మె

పెద్దపల్లిరూరల్: తమ సమస్యలను పరిష్కరించాలంటూ రెండో ఏఎన్ఎంలు 18 రోజులుగా సమ్మెకు దిగినా పాలకులు పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి యాకయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి సదానందం ఆరోపించారు. శనివారం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సునీల్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చర్చించారు.

✦జిల్లా గ్రంథాలయంలో 'బొవెరా' జయంతి

పెద్దపల్లిరూరల్: జిల్లా గ్రంథాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు బోయినపల్లి వెంకటరామారావు (బొవెరా) జయంతి శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి జిల్లా గ్రంథాలయసంస్థ చైర్మన్ రఘువీర్‌సింగ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఆయన సేవలకు గుర్తింపుగా 15న ఆయన జయంతి సందర్భంగా సుల్తానాబాద్ మండలం కదంబాపూర్‌లో రీడింగ్ రూమ్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

✦ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులకు రైల్వేశాఖ శ్రీకారం

ఓదెల: కొలనూర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వేశాఖ శ్రీకారం చుట్టింది. చాలా ఏళ్లుగా కొలనూర్ లెవల్ క్రాసింగ్ గేట్ సమీపంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి కోసం ప్రయాణికులు, గ్రామస్తులు రైల్వేశాఖ ఉన్నతాధికారులకు వినతిపత్రం సమర్పించారు. కొలనూర్‌లో ఫ్లైఓవర్‌బ్రిడ్జి మంజూరైనట్లు అధికారులు ఇటీవల ప్రకటించారు. ఈక్రమంలో రైల్వేశాఖ ఇంజనీరింగు అధికారులు గోపరపల్లెలో మట్టి నాణ్యతను పరిశీలించారు.

✦స్వర్ణకారులకు ప్రభుత్వం చేయూతనివ్వాలి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం స్వర్ణకారులకు చేయూతనివ్వాలని స్వర్ణకారుల సంఘం పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కందుకూరి ప్రకాశ్‌రావు కోరారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం నిరసన తెలిపి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రాజమౌళి, వీరాచారి, రవి, సత్యం, శ్రీనివాస్, సదానందం పాల్గొన్నారు.
ఓదెల: ఓదెలలో తహశీల్దార్ యాకన్నకు స్వర్ణకారులు శనివారం వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు రవీంద్రచారి, ప్రధాన కార్యదర్శి వెంకట్రాజం, కోశాధికారి నరేందర్ పాల్గొన్నారు.
ధర్మారం: ధర్మారం మండల స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం తహసీల్దార్ రజనికి వినతిపత్రం అందించారు. సంఘం మండల ప్రధాన కార్యదర్శి సత్యనారాయణచారి, కోశాధికారి శ్రీనివాస్‌చారి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు



సూచనలు చేస్తున్న డిప్యూటీ కమిషనర్

జ్యోతినగర్: పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ నాగేశ్వర్‌రావు, డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్ తెలిపారు. శనివారం ఎన్టీపీసీ రామగుండం ప్రాంతంలోని ఆటోనగర్, అన్నపూర్ణకాలనీ, కృష్ణానగర్, సింధూర కళాశాల రోడ్‌లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. రోడ్డు పక్కన ఉన్న చెత్త కుప్పలను రోజూ తొలగించాలని మున్సిపల్ శానిటేషన్ సిబ్బందిని ఆదేశించారు. శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.